సాక్షి
జగిత్యాల
మంగళవారం । 13 । ఆగస్టు । 2024

కరీంనగర్ రీజియన్‌కు 70 ఎలక్ట్రిక్ బస్సులు



కరీంనగర్– 2 డిపోతో పాటు నిజామాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యపేట, హైదరాబాద్– 2 డిపోలను ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌కు అద్దెకు ఇచ్చి ఎలక్ట్రికల్ బస్సులు నడిపేందుకు మెజర్స్ జేబీఎం సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



జగిత్యాల: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం జిల్లాకు రానున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల సంక్షేమ హాస్టల్‌ను సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి గణాదిత్య, ఆరో తరగతి విద్యార్థి అనిరుధ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురుకులంలో పరిస్థితిని తెలుసుకునేందుకు ఆయన పాఠశాలను సందర్శించనున్నట్లు వివరించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో భాగంగా నూతన కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యలపై వేగంగా స్పందించాలని సూచించారు.

ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

మొబైల్ ఫోన్ పోయినా.. చోరికి గురైనా సీఈఐఆర్ అప్లికేషన్‌ను వినియోగించుకోవాలని ఎస్పీ తెలిపారు. ఇటీవల ప్రజలు పోగొట్టుకున్న 43 ఫోన్ల (రూ.8లక్షల విలువ)ను బాధితులకు అందించారు. సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసుకునే అవకాశం ఉందని తెలి పారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 468 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ సీఐ రఫీక్‌ఖాన్, సీఈఐఆర్ టీం ఆర్ఎస్సై కృష్ణ, హెడ్ కానిస్టేబల్ మహముద్, కానిస్టేబుళ్లు మల్లేశం, అజర్ యాకూబ్‌ను ఎస్పీ అభినందించారు.

మెట్‌పల్లి మహిళా సమాఖ్యకు రాష్ట్రస్థాయి అవార్డు

మెట్‌పల్లి: అత్యుత్తమ పనితీరు కనబర్చిన మెట్‌పల్లి పట్టణ మహిళా సమాఖ్యను పట్టణ పేదరిక నిర్మూలన మిషన్(మెప్మా) రాష్ట్రస్థాయిలో ఉత్తమ సమాఖ్యగా ఎంపిక చేసింది. 2022–23 ఆర్థి సంవత్సరంలో నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించడంతోపాటు మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో చూపిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఈనెల 14న జరిగే కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు బబ్బూరి లక్ష్మికి అవార్డును అందించనున్నారు.

47.25 టీఎంసీలకు ఎస్సారెస్పీ నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ నీటి మట్టం సోమవారం సాయంత్రం నాటికి 47.25 టీఎంసీలకు చేరిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 4,083 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. కాకతీయ కాలువకు మూడు వేల క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300 క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి



జగిత్యాలఅగ్రికల్చర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పొలాస వ్యవసాయ కళాశాలలో సోమవారం యాంటి ర్యాగింగ్‌పై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ర్యాగింగ్ వద్దని, ఇందుకు కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ర్యాగింగ్‌కు గురిచేస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాల అసోసియేట్ డీన్ భారతీనారాయణ భట్, వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ రఘుచందర్, సీఐ సుధాకర్, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.



మత్తు వదలరా..

- రంగంలోకి నార్కోటిక్ బ్యూరో
- వ్యసనపరుల గుర్తింపు ముమ్మరం
- ప్రతీ మెడికల్ కాలేజీలో డి అడిక్షన్ సెంటర్
- ఒక్కో కేంద్రంలో పది పడకల కేటాయింపు
- ఆరంభ స్థాయికి ఇక్కడే వైద్యం .. ముదిరితే రాజధానికి
- కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, రామగుండంలో సేవలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మత్తు ఒక వ్యసనం. అది ఏ రూపంలోనైనా ఉండొచ్చు. గంజాయి, మద్యం, కల్తీకల్లు, హషీశ్, వైట్‌నర్ లాంటి ద్రావణాలు మత్తు కలిగిస్తూ మనుషులు విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారు. డబ్బు కోసం కుటుంబ సభ్యులను పీడించడం, వేధించడం.. చంపడానికీ వెనుకాడడం లేదు. ఇలాంటి వారిని గుర్తించి వీలైనంత వరకు మార్పు తెచ్చేలా రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీజీ ఏఎన్‌బీ) నడుం బిగించింది. అందుకే, మత్తుకు బానిసైన వారిని గుర్తించి చికిత్స అందించే దిశగా ఏర్పాట్లు చేసింది. ఇందు కోసం ప్రతీప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఒక డి–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది. చికిత్స చేసేందుకు 10 బెడ్లు సిద్ధం చేసింది.

ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారంటే..

మత్తుకు బానిసైన వారిలో పరివర్తన తెచ్చేలా వైద్య చికిత్స అందించేందుకు డి–అడిక్షన్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రత్యేక విభాగం, పదేసి పడకలు సిద్ధం చేసింది. కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని, రాజన్న సిరిసిల్లలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. వాస్తవానికి ఈ ఏర్పాట్లు గతేడాది సెప్టెంబరులోనే మొదలయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ మహమ్మారిని తరిమేయాలన్న లక్ష్యంతో వ్యసనపరులను గుర్తించి చికిత్స అందించాలని నిర్ణయించింది. తద్వారా వ్యసనపరుల సంఖ్యను వీలైనంతగా తగ్గించాలని లక్ష్యంగా నిర్దేశించింది.

గ్రామస్థాయి నుంచి గుర్తింపు..

మత్తుకు బానిసైన వారికి తప్పకుండా వైద్య చికిత్స అందించాలని గత జూన్ 6న అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. వీరితోపాటు పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం సినిమా హాళ్లతోపాటు, స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లోనూ డ్రగ్స్‌పై ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. గంజాయి వినియోగం పట్టణాల నుంచి గ్రామస్థాయికి పాకింది. అందుకే, వ్యవసనపరులను గుర్తించేందుకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీ, మెప్మా సిబ్బంది, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు(ఏఈవో), పంచాయతీ సిబ్బంది, అధికారులు, వార్డు సభ్యులను ఇందులో భాగస్వాములను చేస్తోంది. పాఠశాలల సిబ్బంది, విద్యార్థి నాయకులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా వ్యసనపరులను గుర్తించి మెడికల్ కాలేజీలకు తీసుకువెళ్తారు. మత్తుకు బానిసైన వారికి అక్కడ మానసికంగా కౌన్సెలింగ్ ఇస్తారు. వైద్య చికిత్స చేస్తారు. వ్యసనం బాగా ముదిరిన కేసులను హైదరాబాద్‌కు తరలిస్తారు.

వ్యసనపరులకు వైద్యం



మత్తు పదార్థాలకు బానిసలైన వారికి వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఒక్కో మెడికల్ కాలేజీలో పది పడకలు కేటాయించింది. గంజాయికి బానిసలైన వారిని గుర్తించి ఆస్పత్రికి తీసుకొస్తే సైకియాట్రిస్ట్‌తో చికిత్స చేయిస్తారు. మందులు అందజేస్తారు. వ్యసనపరులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పిస్తారు. మానసిక సమస్యలు అధికంగా ఉంటే హైదరాబాద్‌కు రెఫర్ చేస్తారు.

– డాక్టర్ వీరారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కరీంనగర్

మత్తుతో యువత భవిష్యత్ చిత్తు

జగిత్యాల: మత్తు పదార్థాలతో యువత ఉజ్వల భవిష్యత్ నాశనమవుతుందని ఐసీపీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.కరుణశ్రీ అన్నారు. జిల్లాకేంద్రంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. దేశానికి యువతే శక్తి అని, అలాంటి శక్తి చెడు అలవాట్లకు బానిసై ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకుంటోందని పేర్కొన్నారు. అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. డిగ్రీ కళాశాల చైర్మన్ యాదకృష్ణ, డైరెక్టర్ నరేశ్, మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాంబాబు
- అర్జీలు పరిష్కరించాలని ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చారు. వారి నుంచి అదనపు కలెక్టర్ రాంబాబు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 91 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, ఆర్డీవోలు పులి మధుసూదన్, ఆనంద్‌కుమార్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే పగబట్టిండు



జిల్లాకేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో రోడ్డును ఆక్రమించి కొబ్బరి బొండాల దుకాణాలున్నాయి. దుర్వాసన, దోమలు, ఈగలతో రోగాలకు కారణమవుతున్నాయి. దుకాణాల వద్ద రద్దీతో ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దుకాణాలను తొలగించాలని గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాను. దుకాణదారులతో లోపాయికారి సంబంధాలున్న తాత్కాలిక ఉద్యోగి రాము నాపై పగబట్టి నేను లేని సమయంలో స్వీట్‌హౌజ్ ముందు పెట్టుకున్న రిఫ్రిజిరేటర్ ఎత్తుకెళ్లాడు. బల్దియా కమిషనర్‌ను కలిసినా పట్టించుకోవడంలేదు. ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని పగపట్టి రిఫ్రిజిరేటర్ ఎత్తుకెళ్లిన రాముపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయండి. – సప్పు శ్రీనివాస్‌రావు, జగిత్యాల

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు



1997లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు బాధితులమైన మాకు బీర్‌పూర్ మండలం గంగసముందర్ (మోతినగర్)లో పునరావాస కాలనీ కింద 690ప్లాట్లు ఇచ్చారు. రోడ్లు, పోచమ్మ ఆలయం, పాఠశాల, పార్క్, శ్మశానవాటిక అవసరాలకు ప్రభుత్వం భూములు కేటాయించింది. కొన్ని కుటుంబాలే కాలనీలో నివాసముంటున్నాయి. ఎక్కువమంది ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఆ ప్లాట్లతోపాటు దారి, శ్మశానవాటిక, పాఠశాల, పార్క్ స్థలాలను కొందరు కబ్జాచేశారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి.

– చెంగల్ గంగాధర్, గంగసముందర్, బీర్‌పూర్

కొడుకులు పట్టించుకోవడం లేదు



నాకు ఇద్దరు కొడుకులు గణేష్, రాంప్రసాద్. నా ఆస్తిని అనుభవిస్తున్నారు తప్ప నన్ను పట్టించుకోవడం లేదు. ఇంట్లో నన్ను ఒంటరిగా వదిలేసి వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. సమయానికి అన్నం, మందులు ఇచ్చేవారు లేరు. దుర్భర జీవితం అనుభవిస్తున్నాను. ఆరోగ్యం క్షీణించి కళ్లు కనిపించడం లేదు. సొంతంగా పనులు చేసుకోలేని దయనీయ స్థితిలో ఉన్నాను. నాపై కనికరం లేని నా ఇద్దరు కొడుకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని వృద్ధురాలినైనా నాకు న్యాయం చేయండి. – కటుకం శాంత, పోరుమల్ల

ఎస్సై మా ఫిర్యాదు తీసుకోవడం లేదు



మా పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన రేచపల్లి శివారులోని ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నం. మా గ్రామానికే చెందిన సిరికొండ నడిపి మల్లయ్య ఆ భూమిని దౌర్జన్యంగా కబ్జా చేసేందుకు పలుమార్లు యత్నించాడు. అడ్డుకున్న మాపై సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా కేసు పెట్టాడు. విచారణ చేపట్టకుండానే ఎస్సై మాపై కేసు నమోదు చేశాడు. మేం కూడా ఫిర్యాదు చేసేందుకు వెళ్తే తిరస్కరించి వారితో రాజీ చేసుకోవాలని బెదిరిస్తున్నాడు. ఆ భూమిలోకి వెళ్లబోమని ప్రత్యర్థికి కాగితం రాసిస్తేనే ఫిర్యాదు తీసుకుంటానని, లేదంటే తీసుకోను అంటున్నాడు. మాపై తప్పుడు ఫిర్యాదు చేసిన నడిపి మల్లయ్యతో పాటు మా ఫిర్యాదును నిరాకరించిన ఎస్సైపై చర్యలు తీసుకుని న్యాయం చేయండి. – మామిడిపెల్లి లక్ష్మి, బొమ్మిడి గంగవ్వ, బొమ్మిడి మల్లవ్వ, నగూరి రమ, రేచపల్లి

సంక్షేమ హాస్టళ్లలో వసతులకు కృషి

- మరమ్మతుకు రూ.కోటి
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: జిల్లాలోని 91 సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఇందుకు రూ.కోటి మంజూరు చేయించి నెలరోజుల్లోపు పూర్తి చేస్తామన్నారు. కొన్ని హాస్టళ్లు ఇతర ప్రాంతాల్లో ఉన్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

ఓపెన్ స్కూల్ మంచి అవకాశం

పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ మంచి అవకాశమని విప్ అన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బడిమానేసిన, పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు సువర్ణ అవకాశమన్నారు. మరిన్ని వివరాలకు 9849266786 నంబర్‌లో సంప్రదించాలని కో–ఆర్డినేటర్ శ్యామ్ సూచించారు.

గురుకులంలో వసతులు కల్పించాలి

పెద్దాపూర్ గురుకులంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని విప్ అన్నారు. కలెక్టరేట్‌లో హాస్టళ్ల స్థితిగతులపై సమీక్షించారు. హాస్టళ్ల మరమ్మతుపై నివేదిక తయారుచేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందించాలని, వారంలో ఒక్కో హాస్టల్‌కు ప్రత్యేక అధికారిని నియమించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన..?

- భూకబ్జా యత్నం కేసులో..

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని హస్నాబాద్ శివారు సర్వేనంబర్ 1599లో 12 గుంటల భూమిని కబ్జాకు యత్నించిన కేసులో ఇప్పటికే ముగ్గురు వ్యక్తులతోపాటు, ఆర్వో, మున్సిపల్ కమిషనర్‌పై కేసు నమోదైన విషయం తెల్సిందే. ఆర్వో, ఇతర వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్ ఇటీవల కోర్టులో లొంగిపోయాడు. ఆర్వో సెక్షన్‌లోని మరికొన్ని రికార్డులు అవసరం ఉండటంతో పోలీసులు మళ్లీ అడిగినట్లు సమాచారం. దీంతో సదరు సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు భయాందోళనకు గురై ఆఫీసుకు కూడా రాలేదని తెలిసింది. ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని, ఈ ఒక్కరోజు మాత్రమే వారు రాలేదని పేర్కొన్నారు.



సాక్షి Special Story

పోతూ పోతూ.. జీవం పోస్తూ

కోల్‌సిటీ(రామగుండం): 'అమ్మ జన్మనిస్తే అవయవదానం పునర్జన్మనిస్తుంది.. మరణించినా కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి. ఏలోకంలో ఉన్నా మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి. మన శ్వాస ఆగిపోయినా గుండె మాత్రం లబ్‌డబ్ అని కొట్టుకుంటూనే ఉంటుంది..' ఆయువు పోయినా.. అవయదానంతో ఊపిరిపోద్దాం.. అవయవాలను ఈ లోకంలో జీవించనిద్దాం.. రండి అవయదానం చేద్దాం.. మరణించినా మరో వ్యక్తిలో జీవించే ఉందాం'..! అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా కొందరు ఇంకా అపోహలు, అనుమానాలతో వెనకడుగు వేస్తున్నారు. కానీ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మాత్రం అవయవదానంపై అవగాహన పెరుగుతోంది. మానవతకు అద్దంపడుతున్న అవయవ దానంపై ఏటా ఆగస్టు 13న 'ప్రపంచ అవయవదాన దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

- అవయవ దానానికి ముందుకొస్తున్న కుటుంబాలు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన అవగాహన
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం



ఈ ఫొటోలోని వ్యక్తి గోదావరిఖనికి చెందిన బందెల అయిలయ్య. ఈ ఏడాది మే 22న బ్రెయిన్ డెడ్ కాగా, తాను మరణిస్తూ పలువురికి అవయదానం చేసి పునర్జన్మ ప్రసాదించాడు. ఇంటి పెద్దను కోల్పోయిన దుఃఖంలో కూడా సమాజహితం కోసం అయిలయ్య అవయవాలను భార్య రాజమణి, కుమారుడు అభిజిత్ దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు.

బతికున్నవారు దానం చేసే అవయవాలు

- ఒక కిడ్నీ, • 1/4 వంతు కాలేయం
- ఎముక మజ్జ కణజాలం

మనిషి మరణానంతరం దానం చేసేవి

శరీరంలోని 200 అవయవాలు, కణజాలం దానం చేయవచ్చు. కళ్లు, గుండె, గుండె కవాటాలు, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్దపేగు, చిన్నపేగులు, రక్తనాళాలు, చెవిలోని కర్ణభేరి, ఎముకలు, మూలుగ తదితర వాటిని మృతుల నుంచి తీసుకుంటారు. ఇలా ఒక వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ఏడు నుంచి తొమ్మిది మందికి పునర్జన్మ ప్రసాదించే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

సదాశయ ఫౌండేషన్ ద్వారా అవయవాలు దానం చేసిన వివరాలు..

- నేత్రదానం చేసినవారు : 1,180 మంది
- అవయవదానం చేసినవారు : 88 మంది
- మెడికల్ కాలేజీలకు దేహదానం చేసినవారు : 125 మంది
- అవయవదానంపై అవగాహన సదస్సులు : 1,300
- అవయవదానం చేస్తామని అంగీకరించినవారు: 60వేలకుపైగా

ఉమ్మడి జిల్లాలో అవగాహన కల్పిస్తున్న సంస్థలు

- సదాశయ ఫౌండేషన్
- లయన్స్ క్లబ్
- తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం

• ఇలా సేకరిస్తారు

కుటుంబ సభ్యుల అంగీకారంతో బ్రెయిన్‌డెడ్ పేషెంట్ నుంచి అవయవాలను తీసిన తర్వాత వాటి నాణ్యతను బట్టి నిబంధనల ప్రకారం ఆయా ఆస్పత్రులకు జాగ్రత్తగా తరలిస్తారు. కొన్ని సందర్భాల్లో గ్రీన్ చానల్ కూడా ఏర్పాటు చేసి గుండెను రోడ్డు మార్గంలో తరలిస్తారు.

• అవయవాల కోసం..

అవయవాలు కావాల్సిన వారు ముందుగా జీవన్‌ధాన్ కేంద్రలో పేరు, పేషెంట్ బ్లడ్ గ్రూప్, ఏ అవయవమో నమోదు చేయించుకోవాలి. ఆరోగ్యశ్రీ కార్డు అర్హులకు ఉచితంగా, మిగతావారికి కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మరణానంతరం అవయవదానం చేయాలని కోరుకునేవారు జీవన్‌ధాన్ సంస్థతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అవయవదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్, పలు స్వచ్ఛంద సంస్థల్లో పేర్లు నమోదు చేయించుకోవచ్చు.

• స్పందిస్తున్న కుటుంబాలు

అవయవదానం చేసేందుకు ఉమ్మడి జిల్లాలోని కుటుంబాలు స్పందించి ముందుకు వస్తున్నాయి. ఇందులో మహిళలు, యువతనే ఎక్కువగా ఉంటోంది. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా మృత్యువుకు చేరువలో ఉన్న వ్యక్తి అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వస్తున్నారు. పార్థివదేహం కాలిబూడిదై మట్టిలో కలిసిపోకుండా, వైద్య విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు ఉపయోపడేలా మృతదేహాన్ని కూడా అప్పగించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

స్వచ్ఛంద సేవలందిస్తున్న ప్రతినిధులు

టి.శ్రవణ్‌కుమార్	99486 09591
సీహెచ్.లింగమూర్తి	94927 81306
మేరుగు భీష్మాచారి	98495 90415
బేణిగోపాల్ త్రివేది	98482 18989
కె.శ్రీనివాస్	98497 37100

చట్టసభల్లో శాసనం చేయాలి



చనిపోయిన ప్రతీ వ్యక్తి అవయవాలు, దేహదానం చేసేలా ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, శ్రీలంక తరహాలో చట్ట సభల్లో శాసనం చేయాలి. అవయవదానంపై కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం, జీవన్‌ధాన్ సంస్థ గుర్తించి సహకారం అందించాలి. 2008లో పురుడుపోసుకున్న సదాశయ ఫౌండేషన్ జాతీయస్థాయికి ఎదిగి అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

– టి.శ్రవణ్‌కుమార్, సదాశయ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు

అవగాహనకు నేను సైతం



అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న. రామగుండం నగర తొలి మేయర్‌గా ఉన్నప్పుడే నా మరణానంతరం నేత్రదానం చేస్తానని ప్రకటించా. మా అమ్మ మల్లమ్మ, బామ్మర్ది ఈదునూరి కిషోర్, వరుసకు తమ్ముడైన అంజయ్య మరణిస్తే నేత్రాలను దానం చేయించా. సదాశయ సంస్థ చేస్తున్న సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి సహకారం అందించాలి.

– కొంకటి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు

మెడికల్ కాలేజీలకు పార్థివదేహాలు



సిమ్స్‌కు అప్పగించిన పార్థివ దేహానికి గౌరవ వందనం సమర్పిస్తున్న ప్రతినిధులు, కాలేజీ వైద్యాధికారులు

వైద్య విద్యార్థుల పరిశోధన కోసం మరణించిన తర్వాత పార్థివదేహాన్ని పలువురు మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న వారి సంఖ్య ఉమ్మడి జిల్లాలో పెరుగుతోంది. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 125 మంది తమ పార్థివ దేహాలను మెడికల్ కాలేజీలకు దానం చేశారు. ఇందులో పెద్దపల్లి జిల్లాకు చెందిన గంటి మొండయ్య, సిలువేరి రాజయ్య, మాదిరెడ్డి ఇందుమతి, పంచమర్తి మధునమ్మ, దేవకి, బెల్లంకొండ కేశవరెడ్డి, బెల్లంకొండ రాజమ్మ, బాపయ్య, అనసూర్య, కాసర్ల లలితమ్మ, గుర్రం విమలాదేవి తదితరులు పార్థివదేహాలను వారి అంగీకారం మేరకు కుటుంబ సభ్యులు మెడికల్ కాలేజీలకు అప్పగించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం సిమ్స్‌కు ఐదు పార్థివదేహాలను దానం చేశారు.

క్లుప్తంగా

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేటలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. నిరుపేద విద్యార్థులకు వరంగా మారిన గురుకుల పాఠశాలలపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫుడ్‌పాయిజన్, పాముకాటుతో విద్యార్థులు మృత్యువాత పడుతున్నా.. ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. పెద్ద చదువులు చదివి తమను ఉద్ధరిస్తారని అనుకున్న పిల్లలు గురుకులంలో చనిపోతే ఆ తల్లిదండ్రులకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బాధిత విద్యార్థుల కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ప్రభుత్వపరంగా అన్నిరకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో మాజీ సర్పంచ్ వేల్పుల గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ బిట్ల నరేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మీనుగు చంద్రశేఖర్, భాస్కర్, గంగాధర్, సాయన్న, రాజేష్, రమేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగిత్యాల, ధర్మపురి బంద్

- విజయవంతం చేయండి
- హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపు



బైక్ ర్యాలీలో హిందూ సంఘాల ప్రతినిధులు

జగిత్యాలటౌన్/ధర్మపురి: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందు ఆలయాలపై దాడులను ఖండిస్తూ మంగళవారం జగిత్యాల, ధర్మపురిలో బంద్ నిర్వహిస్తున్నట్లు హిందూ సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు తెలిపారు. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరుతూ సోమవారం జగిత్యాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి, ఏసీఎస్.రాజు, వేముల సంతోష్, లింగంపేట శ్రీనివాస్, ఆంకారి సుధాకర్, కిషోర్ సింగ్, సీపెల్లి రవీందర్, మాడిశెట్టి మల్లేశం పాల్గొన్నారు.

దురలవాట్లతో లక్ష్యసిద్ధి అసాధ్యం

జగిత్యాల: దురలవాట్లు ఉన్న విద్యార్థులు లక్ష్యాలను చేరుకోలేరని ఇంటర్ విద్య నోడల్ అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో హార్ట్ ఫుల్‌నెస్ ఫౌండేషన్, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం, మత్తు పదార్థాల వినియోగంతో అనేక నష్టాలు కలుగుతాయని, జీవితం నాశనం అవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఏకాగ్రత కోల్పోతారన్నారు. ప్రిన్సిపల్ అలియా మక్సూద్, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ మంచాల కృష్ణ, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతుకు 'సాగు' కష్టాలు

- పెరిగిన కౌలు రేట్లు.. పెట్టుబడి
- ఆదుకోని ప్రభుత్వ పథకాలు
- రుణాలివ్వని బ్యాంకులు



పత్తి పంటకు నీటిని అందిస్తున్న కౌలు రైతు

గొల్లపల్లి: గుంట భూమి లేని రైతులు వ్యవసాయంపై మక్కువతో కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. ఈ క్రమంలో అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఓ వైపు పెరిగిన కౌలు ధరలు.. పెట్టుబడి.. ఇవన్నీ పోను పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు వెరసి కౌలు రైతులను కుదేలు చేస్తున్నాయి. ఫలితంగా అప్పుల ఊబిలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్నాడు. అలాంటి కౌలు రైతులను ఆదుకునేందుకు మాత్రం ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు. కౌలురైతులను ఆదుకుంటామన్న సర్కారు మాటలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ భూములు ఉన్న రైతులకు ప్రతి సీజన్‌లో పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.5వేల చొప్పున ఏటా రూ.10వేలు అందించింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఏటా రూ.6వేలు అందిస్తోంది. అయితే కౌలు రైతులకు మాత్రం అటు కేంద్రంగానీ.. ఇటు రాష్ట్రప్రభుత్వంగానీ ఆదుకున్న దాఖలాలు లేవు. వారికి ఎలాంటి పథకాలూ వర్తించకపోవడంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి మరీ పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు భూ యజమానులు ఏటా కౌలురేట్లను భారీగా పెంచుతున్నారు. దీంతో అటు పంటలు సాగు చేయలేక.. ఇటు ఖాళీగా ఉండలేక కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. బోరు బావులు, కాలువల ద్వారా పారకం ఉన్న ప్రాంతాల్లో వానాకాలం సీజన్‌లో ఎకరాకు రూ.12 వేల నుంచి సుమారు రూ.30వేల వరకు కౌలుకు తీసుకోవాల్సి వస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో దుక్కులు దున్నే ట్రాక్టర్ యజమానులు కూడా రేట్లు అమాంతం పెంచారు. నాట్లు, కలుపు తీతకు అవసరమైన కూలీలు కూడా రేట్లు పెంచడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలో సాగవుతున్న భూమిలో సగానికి పైగా కౌలు రైతుల చేతుల్లోనే ఉంది. భూసారం తగ్గడం, నకిలీ విత్తనాలు, ఎరువులు, చీడపీడల కారణంగా ఏటా పంట దిగుబడి తగ్గుతోంది. మరోవైపు చేతికొచ్చిన పంటకు మార్కెట్‌లో సరైన మద్దతు ధర రక తీవ్రంగా నష్టపోతున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్పందించి కౌలు రైతులకు పంట రుణాలు, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలు చేయాలని కోరుతున్నారు. లేకుంటే మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు బాగా పెరిగాయి



ఈ ఏడాది కౌలు ధరలను భూ యజమానులు భారీగా పెంచారు. మంచిగా పంటలు పండే భూములు ఎకరాకు రూ.13 వేల నుంచి రూ.36 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. నేను నా పొలంతోపాటు పక్కనే ఉన్న పదెకరాలు కౌలుకు తీసుకున్నాను. మాలాంటి రైతుల కష్టాలు చూసి రైతుబంధు ఇవ్వాలి. పంటలకు మద్దతు ధర కల్పించాలి.

– గుడ్ల వెంకటేష్, లక్ష్మీపూర్, కౌలు రైతు

పెట్టుబడి భారమవుతోంది



నాకున్న రెండెకరాలతోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకున్నాను. ప్రస్తుతం ధర్మపురి నియోజకవర్గంలో ఎకరాకు రూ.18 వేల నుంచి రూ.25వేల దాకా కౌలు రేటు నడుస్తోంది. అన్ని ఖర్చులు భరించి పంటలు సాగు చేస్తే కొన్నిసార్లు నష్టపోవాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో మాకు దిక్కు లేకుండా పోతోంది. సర్కారు న్యాయం చేయాలి.

– గడప కొంరయ్య, కౌలు రైతు, గొల్లపల్లి

కనీస మదతు ధర చట్టం తేవాలి



మా లాంటి కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టం తేవాల్సిన అవసరం ఉంది. కేంద్రం ప్రకటించే మద్దతు ధరకు తోడు రాష్ట్రం కూడా పంటలకు బోనస్ ఇవ్వాలి. ఈ విధానం ద్వారా పంటలు సాగు చేస్తున్న మాలాంటి కౌలు రైతులకు.. భూ యజమానికి మేలు జరుగుతుంది. బ్యాంక్‌ల నుంచి రుణాలు ఇప్పిస్తే మేలు.

కంది స్వామి, భీంరాజ్‌పల్లి, కౌలు రైతు

ఇద్దరు పిల్లలను బడికి పంపి..

- ఆర్నెళ్ల పాపను పక్కింట్లో ఉంచి..
- ఆత్మహత్య చేసుకున్న వివాహిత




ఆర్నెళ్ల చిన్నారితో సృజన(ఫైల్) సృజన పిల్లలు

కోరుట్ల: ఆ తల్లికి ముగ్గురు ఆరేళ్ల లోపు చిన్నారులే. పొద్దున్నే ఇద్దరిని చక్కగా తయారు చేసి బడికి పంపించింది. ఆరు నెలల పాపను పక్కింట్లో నిద్రపుచ్చింది. పాపకు మెలకువ వస్తే ఇంటికి తీసుకురమ్మని పక్కింటి వారికి చెప్పి మరీ వెళ్లింది. గంట గడిచినా తల్లి రాకపోయేసరికి.. పక్కింటి వారు పాపను ఇంటికి తీసుకెళ్లే సరికి ఆ తల్లి రేకుల షెడ్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. ఈ సంఘటన కోరుట్లలో విషాదం నింపింది. ఎస్సై కిరణ్ కథనం ప్రకారం.. కోరుట్లలోని కాల్వగడ్డ దిగువ భాగంలో పులివేని శశికళ(51) నివాసముంటోంది. ఆమె కొడుకు సురేశ్ కుటుంబ పోషణ కోసం పదేళ్లుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. అతడికి ఏడేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామానికి చెందిన సృజనతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు మిధున్ (6), విహాన్స్(4), ఆరు నెలల కూతురు అనుమ ఉన్నారు. సురేశ్ ఆర్నెళ్ల క్రితమే కోరుట్లకు వచ్చి మళ్లీ గల్ఫ్ వెళ్లాడు. సోమవారం ఉదయం శశికళ తన బిడ్డ వద్దకని ఊరికి వెళ్లింది. సృజన తన కుమారులు మిధున్, విహాన్స్‌లను బడికి పంపించింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆరునెలల పాప అనుమను తీసుకుని పక్కింటికి వెళ్లింది. పాప నిద్రపోగానే వారికి ఇచ్చి.. లేస్తే ఇంటికి తీసుకురమ్మని చెప్పి వెళ్లింది. పక్కింటి వారు కాసేపు చూసి పాపను తీసుకుని సృజన ఇంటికి వెళ్లగా ఆమె ఇంటి రేకులషెడ్‌కు చీరతో ఉరేసుకుని కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వగా బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు ఫయీం అక్కడికి వచ్చి పోలీసులకు విషయం చేరవేశాడు. ఎస్సై కిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. గల్ఫ్ నుంచి భర్త సురేశ్ పంపే డబ్బుల విషయంలో చిన్నపాటి గొడవలు ఉండటంతో సృజన ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సృజన మృతితో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. తల్లి మృతిచెందడం.. పిల్లలు రోదిస్తుండడాన్ని చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం

- కొత్తగా ఐదు గ్రామపంచాయతీలు
- పంచాయతీ కార్యదర్శులకు శిక్షణపూర్తి
- ప్రభుత్వం ఆదేశిస్తే ఎన్నికలే..



జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీ ఎన్నికలకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. గతంలో గెజిట్ ప్రకారం జిల్లాలో ఐదు కొత్త గ్రామపంచాయతీలు పెరుగనున్నాయి. దీంతో మొత్తం 385 గ్రామ పంచాయతీలు, 3,536 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 380 గ్రామపంచాయతీలు, 3500 వార్డులున్నాయి. అయితే గతంలో విడుదలైన గెజిట్ ప్రకారం మరో ఐదు గ్రామపంచాయతీలు, 36 వార్డులు పెరగనున్నాయి.

పెద్దపల్లి నుంచి జిల్లాకు మూడు పంచాయతీలు

గత గెజిట్ ప్రకారం జిల్లాలోని ఎండపల్లి మండలంలో ఉన్న మూడు గ్రామపంచాయతీలు గతంలో పెద్దపల్లి జిల్లాలో ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం ఎండపల్లి మండలంలోని ఉండెడ, మారెడుపల్లి, ముంజంపల్లి పంచాయతీలు జగిత్యాల జిల్లాలోనే ఎన్నికలు నిర్వహించనున్నారు.

కొత్తగా రెండు గ్రామపంచాయతీలు

జిల్లాలో గతంలో ఉన్న గ్రామపంచాయతీలకు మరో రెండు కొత్త పంచాయతీలు ఏర్పాటుకు అనుమతులు రానున్నాయి. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లిలోని ఇందిరానగర్, మంగేళ పంచాయతీలోని గొండుగూడెంలను ప్రభుత్వం పంచాయతీలుగా ప్రకటించనుంది.

శిక్షణ పూర్తి...

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాపై ఈనెల రెండున హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన ఐదుగురు ఈ కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయిన తర్వాత జిల్లా కేంద్రంలో జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలకు ఓటరు జాబితా తయారు, ఎన్నికలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. పంచాయతీల్లో వార్డులవారీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని, జాబితా ప్రక్రియ మొత్తం సిద్ధం చేసి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఎన్నికలకు సిద్ధం

ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ఈ కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చింది. పంచాయతీ కార్యదర్శులకు ఓటరు జాబితా తయారీపై ఇప్పటికే శిక్షణ పూర్తి చేశాం. గ్రామాల్లో వార్డులవారీగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు.

– రఘువరణ్, ఇన్‌చార్జి డీపీవో

జాతీయ రహదారి గుంతలమయం

- పలుచోట్ల దెబ్బతిన్న వైనం
- మరమ్మతు చేపట్టడంలో నిర్లక్ష్యం
- ప్రమాదాల బారిన వాహనదారులు



మెట్‌పల్లి పట్టణంలో దెబ్బతిన్న రోడ్డు



మెట్‌పల్లి శివారులో రహదారిపై ఏర్పడిన గుంతలు

మెట్‌పల్లి: జిల్లాలో ప్రధానమైన 63 జాతీయ రహదారి నిర్వహణ విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. చాలాచోట్ల గుంతలు ఏర్పడి ఈ రహదారి దెబ్బతింది. వీటి వద్ద వాహనాలు ఆదుపు తప్పి తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదకరంగా ఉన్న గుంతలకు మరమ్మతు చేపట్టే విషయంలో సంబంధిత అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఫలితంగా రహదారిపై ప్రయాణం చేయడం వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

జిల్లాలో 69కిలోమీటర్లు

- జిల్లాలో జాతీయ రహదారి 69 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.
- ప్రధాన పట్టణాలైన మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి మీదుగా ఇది వెళ్తుంది.
- జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది.
- చాలాచోట్ల లోతైన గుంతలతో పూర్తిగా దెబ్బతింది.
- మెట్‌పల్లిలో కిలోమీటర్ దూరంలోనే నాలుగైదు చోట్ల పెద్ద గుంతలతో అధ్వానంగా మారింది.
- ఇలాంటి చోట్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- రహదారిపై ఎస్సారెస్పీ కెనాల్ వెళ్తున్న చోట దశాబ్దాల క్రితం వంతెనలు నిర్మించారు. ఇరుకుగా ఉండడంతో కొన్నిచోట్ల విస్తరించారు. మరికొన్ని చోట్ల అలాగే ఉంచడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరమ్మతులపై నిర్లక్ష్యం

- జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడితే వాటిని గుర్తించి తక్షణమే మరమ్మతు చేపట్టాలి.
- ఈ విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- నెలల తరబడి గుంతలను అలాగే వదిలేస్తుండడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు.
- ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేశాం

జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతల మరమ్మతు కోసం అవసరమైన నిధులను మంజూరు చేశాం. ఆ పనులను వెంటనే చేపట్టాలని స్థానిక అధికారులకు సూచించాం. తొందరలోనే అవి పూర్తవుతాయి.

– అజయ్ మణికుమార్, ఎన్‌హెచ్ఏఐ అధికారి

కరీంనగర్ రీజియన్‌కు 70 ఎలక్ట్రిక్ బస్సులు



సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు

- ఇప్పటికే కరీంనగర్–2 డిపోకు చేరుకున్న 33 బస్సులు
- ఈనెల 20లోపు ప్రారంభించేందుకు ఏర్పాట్లు

కరీంనగర్: కొన్నేళ్లుగా నష్టాల ఊబిలో కూరుకుపోతున్న ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకువచ్చేందుకు సంస్థ ఎన్ని ప్రయత్నాలు చేసినా సఫలం కావడం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానమైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థ మరింత నష్టాల్లోకి చేరుకుంది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం నష్టాలను పూడ్చుకునే పనిలో కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూనే ఉంది. తాజాగా రాష్ట్రంలోని కొన్ని డిపోలను మెజర్స్ జేబీఎం అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని డిపోలను ప్రైవేట్ పరం చేసే పనిలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా కరీంనగర్– 2 డిపోతో పాటు నిజామాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, హైదరాబాద్– 2 డిపోలను ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌కు అద్దెకు ఇచ్చి ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు మెజర్స్ జేబీఎం సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈక్రమంలో కరీంనగర్– 2 డిపోకు ఎలక్ట్రికల్ బస్సులు చేరుకోవడంతో వాటిని ప్రారంభించేందుకు మొదటగా ఈ డిపోనే ఎంపిక చేశారు.

ఆర్టీసీ 2 డిపో ప్రైవేట్ పరం

రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కరీంనగర్ –2 డిపో ప్రైవేట్ పరం కానుంది. 2వ డిపోలో ఎలక్ట్రికల్ బస్సులు నడిపించేందుకు మెజర్స్ జేబీఎం సంస్థ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే డిపోకు 33 ఎలక్ట్రిక్ బస్సులు చేరుకున్నాయి. కరీంనర్ రీజియన్ పరిధి నుంచి 70 ఎలక్ట్రికల్ బస్సులు వివిధ రూట్లల్లో నడిపించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈనెల 20వ లోపు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బస్సులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండవ డిపో నుంచి ప్రస్తుతం ఆర్టీసీ 53 సొంత, 52 అద్దె బస్సులు ఆపరేట్ చేస్తుంది. 360 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. డిపోను ప్రైవేట్ పరం చేస్తుండడంతో కండక్టర్లు మినహా మిగతా ఉద్యోగులను ఇతర డిపోల్లోకి కేటాయించేందుకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. కాగా సదరు డిపోలో పనిచేస్తున్న సిబ్బంది స్థానచలనంపై అయోమయంలో ఉన్నారు.

రీజియన్ నుంచి రూట్‌లోకి వెళ్లే బస్సులు ఇలా..

రూటు	బస్సుల సంఖ్య
కరీంనగర్– జేబీఎస్	33
కరీంనగర్– సీబీఎస్	06
కరీంనగర్– గోదావరిఖని	09
కరీంనగర్– మంథని	04
కరీంనగర్– కామారెడ్డి	06
కరీంనగర్– జగిత్యాల	06
కరీంనగర్– సిరిసిల్ల(నాన్‌స్టాప్)	06
మొత్తం	70

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

కరీంనగర్–2 డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు రానుండడంతో అధికారులు మౌలిక వసతుల ఏర్పాట్లపై దృష్టిసారించారు. డిపోలో ఇప్పటికే 11కేవీ విద్యుత్ లైన్లు, 14 చార్జింగ్ పాయింట్లు, 3 ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించే పనిలో పడ్డారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఎలక్ట్రికల్ బస్సులను ఈనెల 20లోపు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. రీజియన్ నుంచి 70 బస్సులను వివిధ రూట్లల్లో నడిపించేందుకు సన్నాహాలు చేపట్టాం.

– సుచరిత, ఆర్టీసీ ఆర్ఎం

సేవలు అందేనా..?

- ఆస్పత్రులకు అనుబంధంగా యోగా కేంద్రాల ఏర్పాటు
- శిక్షకులు లేక నిరుపయోగం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 44 యోగా శిక్షణా కేంద్రాలు



ధర్మపురిలో యోగా శిక్షణా కేంద్రం

ధర్మపురి: ప్రస్తుత జీవన విధానంలో ప్రజలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం యోగా శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించింది. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్న దృఢ సంకల్పంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

ఉమ్మడి జిల్లాలో 44 కేంద్రాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 44 యోగా కేంద్రాలు మంజూరయ్యాయి. జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా కేంద్రప్రభుత్వం మొదటి విడతలో కేంద్రాలను మంజూరు చేసింది. వాటిలో కరీంనగర్ జిల్లాకు 14, జగిత్యాల 12, రాజన్న సిరిసిల్ల 8, పెద్దపెల్లి జిల్లాకు 10 చొప్పున కేటాయించింది. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున రూ.2.64 కోట్ల నిధులు మంజూరైనాయి. జగిత్యాల జిల్లాలో ధర్మపురి, కోరుట్ల, మెట్‌పెల్లి, అబ్బాపూర్, బతికెపల్లి, వీవీరావ్‌పేట్, బండ లింగాపూర్, ఎండపెల్లి, లక్ష్మీపూర్, కొడిమ్యాల, వెల్లుల్ల, చిల్వకోడూర్ ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా ఆయుష్ వెల్‌నెస్ కేంద్రాలను (ఆరోగ్య స్వస్థత కేంద్రం) ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రం షెడ్డు నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున జగిత్యాల జిల్లాకు రూ.72 లక్షలు మంజూరయ్యాయి. జిల్లాలో మొత్తం 12 షెడ్ల నిర్మాణం చేపట్టగా వాటిలో ధర్మపురి, మెట్‌పెల్లి, బతికెపల్లి, లక్ష్మీపూర్, ఎండపెల్లి, వీవీరావుపేట్‌లో పూర్తయినాయి. మిగిలిన ఆరు చోట్ల పనులు చివరిదశకు చేరాయి. అంతే కాకుండా శిక్షణా కేంద్రాల వద్ద హెర్బల్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల ఔషధ మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఇద్దరు శిక్షకులతో..

యోగాలో మంచి ప్రావీణ్యం సంపాదించి, సర్టిఫికెట్ పొందిన వారిచే శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో కేంద్రానికి ఒక మహిళ, ఒక పురుషుడు ఇద్దరు శిక్షకులతో శిక్షణ ఇవ్వనుండగా, వారికి నెలకు రూ.6 వేల చొప్పున చెల్లించనున్నారు. ఆరోగ్య భారత్‌లో భాగంగా ప్రతి ఒక్కరికి యోగా కేంద్రంలో శిక్షకులచే యోగాసనాలు నేర్పించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. యోగా కేంద్రాలు సత్ఫలితాలిస్తే ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయుటకు కేంద్రప్రభుత్వం ఆలోచిస్తోంది.

నిరుపయోగంగా కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో నిర్మించిన యోగా కేంద్రాల్లో శిక్షకులను నియమించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రకృతి వైద్యంపై శిక్షణ, ఫిజియోథెరపీ వంటి చికిత్సలు అందించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఏ కేంద్రాల్లో శిక్షకులను నియమించలేదు. ఒక్కో కేంద్రానికి ఇద్దరు యోగా శిక్షకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామన్న అధికారులు ఇంత వరకు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో నిర్మించిన షెడ్లు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి.

కేంద్రాల్లో శిక్షకులను నియమిస్తాం



యోగా శిక్షణా కేంద్రాల్లో ఇంకా శిక్షకులను నియమించలేదు. త్వరలోనే కేంద్రాలను ప్రారంభిస్తాం. అనుభవజ్ఞులైన లోకల్ శిక్షకులను నియమిస్తాం.

– డాక్టర్ మహేందర్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి ఆయుష్ విభాగం

లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు

జగిత్యాలజోన్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, పోక్సో స్పెషల్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి జి. నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. ధర్మపురి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు కూలీ పనులకు వెళ్లి తమ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. కూతురుకు ఉన్నత చదువుల రీత్యా ఇతర ప్రాంతంలో సీటు వచ్చింది. అదే సమయంలో కరోనాతో లాక్‌డౌన్ కావడంతో కళాశాలకు సెలవు ఇచ్చారు. దీంతో బాలిక ఇంటికి చేరింది. 2020 జూన్ 6న ఎప్పటిలాగే బాలిక తల్లిదండ్రులు ఉపాధి పనులకు వెళ్లారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన సాయిని గంగన్న వచ్చి బాలికపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. బాలిక అరవడంతో ఆమె తమ్ముడు, మరో బాలుడు రావడంతో గంగన్న పారిపోయాడు. తల్లిదండ్రులు బాలికతో కలిసి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్సై కె.శ్రీకాంత్ దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, బి.రాజు, వి.శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో జడ్జి గంగన్నకు మూడేళ్ల శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.